24

# సాధారణం

మనసు పగిలిన అద్దంలా తయారైపోయింది. పదేపదే ఆ దృశ్యమే కన్నుల్లో కదిలి ఎందుకో సముద్రంలో పడి కొట్టుకుపోతున్నట్టుగా అనిపిస్తోంది. అసలు నిజానికి తను యింత చిన్న విషయానికి యింతగా బాధపడాల్సిన అవసరం లేదు.

అసలు యీ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న చిత్రమైన గుణమే యింత. తనకు నచ్చిన విద్యార్థుల్లో ఎవడైనా చెడుదారిలోకి నడిచిపోతూ పతనంలోకి కొట్టుకుపోతున్నాడూ అంటే మనసు గిలగిల్లాడి పోతుంది. నీటిలోనుండి బటయపడ్డ చేపలా గిజగిజా తన్నుకుంటుంది. తన శరీరంలోనుండి ఏదో అంగం తెగిపోతున్నట్లుగా అనిపిస్తుంది.

యీ విధంగా అందరికీ అనిపిస్తుందా - అంటే ఏమో.. నాకు తెలియదు. నాకు మాత్రం అనిపిస్తుంది. మరి అది నా తత్వమో, బలహీనతనో - ఏమిటో అర్థం గాదు.

నేను సిటీనుంగి మిసిమికొండ హైస్కూల్‌కు ట్రాన్స్‌ఫరై ఓ ఆరునెల్లయింది.

యీ ఉపాధ్యాయ వృత్తిలో యింకో గమ్మత్తయిన అనుభూతి కూడా అనుభవంలోకి వస్తూంటుంది. ఉపాధ్యాయుడు ఓ పాఠశాలలో పనిచేస్తున్నప్పుడు నెమ్మదిగా విద్యార్థులకూ, తనకూ నడుమ ఓ అవగాహనతో కూడుకున్న విచిత్రబంధాన్ని ఏర్పరచుకుంటాడు. విద్యార్థులకూ, తనకూ మధ్య ఓ అనన్యమైన సన్నిహితత్వమో, వికర్షణో నెలకొంటుంది. ఆ ముద్రలో నుండి ఉపాధ్యాయుడు పిల్లలకు పాఠాలు చెప్పడం, ఆ ముద్రలోనుండే విద్యార్థులు అతనితో ప్రవర్తించడం జరుగుతుంటుంది. ఆ అనుబంధం అలా కొనసాగుతూండగా ఆ ఉపాధ్యాయునికి అక్కడి నుండి ట్రాన్స్‌ఫర్ కావడం, అప్పటిదాకా పెంచుకున్న సంబంధాల తాలూకు తంపరనంతా తెంచుకుని వెళ్ళిపోవడం,

మళ్ళీ కొత్తబడిలో, కొత్త మనుషులతో, కొత్త విద్యార్థులతో పరిచయాలు కల్పించుకోవడం, వాళ్ళతో సర్దుకుని వాతావరణానికి అనుగుణంగా తనను తాను మలచుకోవడం, మళ్ళీ ఓ కొత్త మూసలో యిమిడిపోవడం. ప్చ్..... యిదంతా ఓ గమ్మతయిన అనుభవం. యీ వృత్తిలో ఎన్నో రకాల తత్వాలున్న వ్యక్తులను చదువుతూ... ఎన్నో వింత మనసులున్న పిల్లల నడుమ మెదులుతూ. 'అబ్బా ...ఎన్ని రకాల మనుషులుంటారు యీ ప్రపంచంలో' అనిపిస్తుంటుంది అప్పుడప్పుడు.

మిసిమికొండలో జాయినైన తర్వాత ఓ వారం పదిరోజులలోనే స్టూడెంట్స్‌లో నాపై మంచి ముద్రపడింది. " సార్ బాగా పాఠాలు చెబుతాడు" అన్న పేరొచ్చింది. ఈ ముద్రతో

సంక్రమించిన గౌరవం, విద్యార్థులు ప్రేమగా నన్ను అభిమానిస్తూ చూపించే అదరణా నన్ను ఎంతో తృప్తిపరిచాయి.

ఐతే ప్రతి ఉపాధ్యాయునికీ తను పాఠం చెప్పే ప్రతి క్లాసులోనూ తను ప్రత్యేకించి అభిమానించే ఒకరిద్దరు విద్యార్థులుంటారు. వాళ్ళంటే అతనికి ఓ అసాధారణమైన అప్యాయత ఉంటుంది. దానికి కారణాలు ఎన్నో ఉన్నా సర్వసాధారణంగా ఓ ఉపాధ్యాయుని ప్రత్యేకాభిమానానికి పాత్రుడు కావడానికి విద్యార్థి తెలివిగలవాడు కావడం, చదువులో చురుగ్గా ఉండడం అన్న విషయం ప్రముఖపాత్ర వహిస్తుంది.

సరిగ్గా ఆకారణంతోనే నేను నరసింహులును అభిమానించేవాణ్ణి.

నరిసింహులు నేను ఆరు నెలలక్రితం ఆ స్కూల్‌కు వచ్చినపుడు తొమ్మిదో తరగతిలో ఉండేవాడు. యిప్పుడు పదోక్లాస్‌లోకి వచ్చాడు.

నేను పాఠం చెబుతున్నపుడు ప్రతి క్లాసులోనూ వాని దగ్గర ఓ అసాధరణ ప్రజ్ఞ కనిపించేది. ఎంతో సునిశితమైన మేధాసంపత్తి వాని దగ్గరుంది. ఏ విషయాన్నయినా ఒకసారి చెబితే అయస్కాంతంలా చటుక్కున పట్టేసి అడగ్గానే గడగడా చెప్పేసేవాడు. వాని ప్రతి పనీ ఎంతో చురుగ్గా, ప్రతి కదలికా ఎంతో మెరుగ్గాఉండేది. క్లాసులోని పిల్లలందరిలోకి ఫస్ట్ మార్క్స్ ఎప్పుడూ వాని వశమే అయ్యేవి.

ఐతే నరసింహులు వచ్చింది మాత్రం ఓ చితికిన కుటుంబం నుండి.

బహుశా వాడిపై నాకంత గాఢాభిమానం ఏర్పడటానికి అది కూడా ఓ పరోక్ష కారణంగా తోస్తుంటుంది నాకు అప్పుడప్పుడు.

నరసింహులుకు తండ్రి లేడు.తల్లి మాత్రమే ఉంది.తండ్రి చనిపోయాడంటారు కొందరు. వాని తండ్రిచేత తల్లి బహిష్కరించబడి ఈ విధంగా ఒంటరిదైపోయిందని అనుకుంటారు మరికొందరు. సరే - ఎవరేమనుకున్నా వాడికి తల్లి తప్ప యింకెవరూ దిక్కులేరన్నది మాత్రం నిజం.

అందుకనే నరసింహులు అంటే నాకు జాలి.

అందుకనే నరసింహులు అంటే నాకు సానుభూతి.

అందుకనే నరసింహులు అంటే నాకు ప్రేమ.

ఓ విద్యార్థి చుట్టూ అడగకముందే అన్ని సదుపాయాలూ సమకూరే ఏర్పాట్లూ, దేనికీ లోటులేని అన్ని హంగులూ ఉన్నప్పుడు వాడుచక్కగా చదువుకోవడం ఓ పెద్ద గొప్ప విషయం గాదు.

అస్తవ్యస్తంగా ఉన్న పరిస్థితులనూ, అవసరాలు తీర్చని లోట్లనూ, ఆర్థికపరమైన ఇబ్బందులనూ జయిస్తూ మనిషి చీకట్లో నుండి వెలుగులోకి రావడం ఓ అసాధారణ ప్రజ్ఞ.

డాక్టర్ కొడుకు డాక్టర్ కావడం అసామాన్యం కాదు.

హమాలీకొడుకు డాక్టర్‌కావడం ఎంతోకష్టంతో కూడుకున్న పని.

ఇవన్నీ నరసింహులు గురించి నేను వ్యక్తిగతంగా తయారుచేసుకున్న అభిప్రాయాలు.

నరసింహులు తల్లిని చూస్తే నాకు ఎప్పుడూ పందిరి బరువునుమోస్తున్న గుంజలు గుర్తొస్తాయి. ఆమె తన భవిష్యత్తునూ, బ్రతుకునూ నరిసింహులు కళ్ళలో వెదుక్కొనేది. ఎన్నోసార్లు నరసింహులు గురించి మా యింటికొచ్చి తన ఆశలను వెళ్లబోసుకుని, కంట తడిపెట్టుకుని పోయిందామె.

ఆమె ఎక్కడెక్కడో ఎవరెవరి పొలాల్లోనో కూలీ పనిచేసేది. ఊళ్ళోని పెద్దమనుషుల యిండ్లలో ఏ పనిబడితే ఆ పని చేసేది. గాడిదకన్నా హీనంగా ఒంటిని హూనం చేసుకుని కష్టపడేది. ఆమె ఏది చేసినా యెన్నడూ తనకోసం ఏదీ చెయ్యలేదు. ఆమె ప్రతి కదలికా నరసింహులు కోసం. ఆమె ఊపిరే నరసింహులు.

"“అలాంటి నరసింహులు.. ఇవ్వాల...” ఒళ్ళు మండిపోయింది. మళ్ళీ ఓ మూడు రోజుల నుండి నరసింహులు బడికి రావడం మానేశాడు. మొదటిరోజు చూచి సాయంకాలం వాళ్ళింటికి యెవరినైనా పంపి వాకబు చేద్దామనుకుంటూండగా నరసింహులు తల్లి ఆందోళనగా వచ్చింది నా దగ్గరికి.

వచ్చి “ప్రొద్దటి నుండి మావాడు కనబడ్డంలేదు పంతులు గారూ. రోజూ మాపటేల యింటికి రాంగనే నాక్కనిపించేటోడు. యియ్యాల వానిజాడే లేదు” అంది.

నాకూ అదే అర్థంకాలేదు.

ఎన్నడూ బడికి తప్పించకుండా రెగ్యులర్‌గా వచ్చేవాడు. ఏమైపోయినట్టు అని నేను కూడా నాకొడుకే యెక్కడో తప్పిపోయినంతగా బాధపడ్డాను.

ఏదో చెప్పి ఆమెను పంపించి ఆలోచనలో పడ్డాను.

ప్చ్ - నరసింహులు కనబడకపోవడానికి ఏ కారణమూ కనిపించ లేదు నాకు.

ఆ తర్వాత -

ఇంకో రెండురోజులు కూడా నరిసింహులు బడికిరాలేదు, వాని జాడ కూడా తెలియదు.

ఐతే నా పరిశీలనా పలితంగా తేలిన విషయం ఏమిటంటే - యీ మూడురోజుల నుండీ నరసింహులతోపాటు ఊరి ప్రెసిడెంటు కొడుకూ, యింకో డబ్బున్న ఆసామికొడుకూ కూడా బడికి రావటం లేదని.... వీళ్ళు ముగ్గురూ ఎటో మాయమైపోయారూ అని.

ఆ మిగతా యిద్దరూ నరసింహులు క్లాస్‌మేట్స్. చదువులో పెద్దమొద్దులు. అందులో ఒకడు కాస్త కురూపి. ఇంకొకడు కాస్త కుంటుతూ నడిచే ఒంటి కాలివాడు. ఐనా వాళ్ళకు డబ్బుంది. కాబట్టి భవిష్యత్తుంది వాళ్ళకు.

నరసింహులు నిజంగా యెంతో అందంగా ఉంటాడు - డబ్బే గనుక వానికుంటే వాడు దొరబిడ్డలా కనబడేవాడు.

వీడు వాళ్ళతోఎందుకు చేతులుకలుపుతున్నట్టు? వాళ్ళతో కలిసి తన గురించిగానీ, తన పరిస్థితి గురించిగానీ ఆలోచించుకోకుండా ఎక్కడికి ఉడాయించినట్టు. వాళ్ళతో కలిసి వాడూ ఆ పాడు అలవాట్ల ప్రవాహంలో కొట్టుకపోవడంలేదు గదా!

ఆ తర్వాత ఓ రోజు ప్రెసిడెంట్ కలిస్తే అడిగాను " మీ అబ్బాయి బడికి రావడం లేదు. ఎందుకూ " అని

"వాడు నాతో చెప్పకుండానే వరంగల్ వెళ్ళిపోయాడటండీ. అక్కడ మా చెల్లీ వాళ్ళున్నారు గదా" అన్నాడు. అని నవ్వుతూ వెళ్ళిపోయాడు

ఆ తర్వాత దినం... అంటే ఇవ్వాళ... యివ్వాళకూడా బడికి రాలేదు యీ ముగ్గురూ.

సాయంకాలం పాఠశాల ఐపోయింతర్వాత చెరువు గట్టు మీది నుండి యింటికొస్తున్నాను. గట్టుకు అటువైపు పొలాలున్నాయి. ఇటు దిక్కు తాటితోపు వుంది.

అటువైపు ఈతపొదలున్నాయి. యింకాస్త లోపలికి కల్లు అమ్మే మండువా ఉంది. ప్రతి సాయంకాలమూ కల్లు మండువా నిండా జనం ముమ్మరంగా ఉంటారు. అది తాగే సమయం.

నేను వస్తూండగా -

ప్రక్కన ఈతపొదల్లో ఏదో అలికిడి వినిపిస్తే అటు చూశాను.

వీళ్ళు ముగ్గురూ - యింకో గొడు.

నరసింహులు బాగా తాగినట్లున్నాడు అప్పటికే - ఓ తాటిచెట్టు మొదటికి చేర గిలబడి ఒరిగి హాయిగా సిగరెట్టు కాలుస్తున్నాడు. మిగతా యిద్దరిలో ప్రెసిడెంటు కొడుకు తాటి ఆకులో కల్లుతాగుతున్నాడు. ముగ్గురి గుడ్డలూ మాసి... నెత్తులు చెరిగి... ముందరన్నీ బీడి పీకలూ.. సిగరెట్టు ముక్కలూ.....

ఒళ్ళు కంపరమెత్తిపోయింది.

పదవక్లాసుకూడా ప్యాసుకాని యీ వెధవలు ఈ పోకిరివేషాలు వేస్తూ... ఈ మూడురోజులు వరంగల్ సిటీకివెళ్ళి ఎక్కడెక్కడో కుక్కల్లా తిరిగి.... అసలు వీళ్ళకి డబ్బెక్కడిది....

ఎక్కడో దొంగిలించి ఉంటారు.

కాని... యీ నరసింహులుగాడు వీళ్ళతో కూడి,

వాని తల్లి నా కన్నుల్లో కదిలింది దీనంగా. గుండెల్లో నుండి ఏదో పిచ్చి ఆవేశం ముంచుకొచ్చి గబగబా గట్టుదిగి నరసింహులు గల్లా పట్టుకుని లేబట్టి అచెంపా యీచెంపా

యిష్టమెచ్చినట్టు వాయించి, నోటికొచ్చినట్టు తిట్టి ఏవేవో అన్నాను. " నీ తల్లి నీకోసం రక్తాన్ని నీళ్ళు చేసుకుంటోందిరా, సిగ్గు లేదూ - నీ సంగతి నువ్వు ఆలోచించుకోకుండా ఎందుకురా యీ పశువు బ్రతుకు బుద్ధి లేదూ" యిలా ఎన్నో..

ఐతే చివరన వాడన్నమాట నేనన్న అన్నిమాటల కన్నా ఎంతో ప్రభావవంతంగా నాపై పనిచేసింది. "నా యిష్టమెచ్చినట్టు నేను చేసుకుంటాను. నడుమ మీకేంది సార్ అన్నాడు. అని ఓ పామువంక చూస్తున్నట్లు భయాన్నీ, అసహ్యాన్నీ కలగలిపి వింతగా చూశాడు. నేను కాల్షియం యింజక్షన్ తీసుకున్న మనిషిలా నిప్పుల్లోపడ్డట్టు ఐపోయి చరచరా యింటికొచ్చేశాను నిశ్శబ్దంగా,

ఔను - నరసింహులు గురించి నాకేమిటి. ఎందుకీ పట్టింపు .... వాణ్ణి తనుయింత ఆదరణగా చూచుకుంటే యిప్పుడు ఎంత సులభంగా రాయితో కొట్టినట్టు మాటనగలిగాడు.. ప్చ్..... మనస్సు గిలా గిలా తన్నుకుంది.

విద్యార్థికీ, ఉపాధ్యాయునికీ నడుమ ఉండే వింత అనుబంధం యిది.

మా ఆవిడ అడిగింది ఆ సాయంత్రం 'అదేమిటంటడీ అలా ఉన్నారూ' అని.

ఏం సమాధానం చెప్పగలను. చెప్తే ఎవడో ఏదో ఐపోతే మీకు యింత వ్యథ ఎందుకూ అంటుంది.

యీ బాధ ఎవరితోనూ చెప్పరానిది. చెప్పలేనిది

' ప్చ్ ఏమీ లేదు ' అని తప్పించుకున్నాను.

ఆ తర్వాత కూడా నరసింహులు సరిగ్గా బడికి రావడం మానేశాడు. ఇంకా ఆ యిద్దరితోకలసి తిరగడం ఎక్కువైంది. చెడు సావాసం అంటువ్యాధిలా వాన్ని తొలచి-వేయడం ప్రారంభించింది.

ఐతే... వాణ్ని చూస్తూ చూస్తూ మందలించకుండా ఉండలేకపోయాను. అంటే అన్నాడులే అని వాడు అన్న మాటలు మరచిపోయి మళ్లీ ఓసారి వాణ్ని మార్చే ప్రయత్నం చేశాను. కాని యీ సారి యింకాస్త ఘాటైన సమాధానం లభించింది నాకు వాని నుండి. " నేనేమైనా మీకనవసరం. మీ సంగతి మీరు చూసుకోండి" అని.

యిక నాకు వాని మీద మనసు విరిగి ఒట్టి భ్రాంతి మాత్రమే మిగిలిపోయింది. ఈలోగా వాని తల్లి వచ్చి లబో దిబో మొత్తుకుంది.

కాని ఏం లాభం.

యిక పదవతరగతి పరీక్షలు ఓ పదిహేనురోజులున్నాయనగా.... ఓరోజు ఓ ఏడవతరగతి కుర్రాడు నా దగ్గరకు పరిగెత్తుకొచ్చి "నరసింహులు కాలు విరిగింది సార్"అని చెప్పాడు హడావిడిగా.

"ఎక్కడ్రా"

"తాళ్ళల్ల కోతికొమ్మచ్చి ఆడుతాంటే ప్రెసిడెంటు కొడుకు భాస్కర్ నరసింహులును చెట్టుమీదినుంచి కిందికి నూకేసిండట. వాళ్ళమ్మ మొత్తుకుంట ఏడుత్తాంది..."

" ఎక్కడ - పద"

పరుగెత్తాను గబగబా.

నిజంగానే కుడికాలు రెండుచోట్ల విరిగింది. వాడు ఏడుస్తున్నాడు. వాని తల్లి మొత్తుకుంటోంది.

అక్కడ ప్రెసిడెంట్ కొడుకు లేడు. యింకో డబ్బున్న మనిషి కొడుకూ లేడు. పరారైపోయారు. వాళ్ళు ఉన్నా ఎవరూ చేగలిగిందేమీ లేదు. ఊరు బ్రతుకంతా వాళ్ళిద్దరి తండ్రుల చేతుల్లో ఉంది.

"ఎట్ల పడ్డవ్రా?"

"భాస్కర్ నూకేసిండు. సార్"

యిక దర్యాప్తు అనవసరం. కావలసింది చికిత్స. ఎవర్నో పట్టుకుని, ఏ బండో ఏర్పాటు చేయించి, వాణ్ణి, వాని తల్లినీ వరంగల్‌కు చేర్పించి హాస్పిటల్‌లో అడ్మిట్ చేయించాను. వరుసగా ఓ మూడు నాల్గు రోజులు దవాఖానకు తిరిగి చేతనైన సహాయం చేశాను. నాల్గోనాడు కాలుకు సిమెంట్‌పట్టీ వేసి, బరువులు వ్రేలాడదీసి ఓ రెండు నెలలు దవాఖానలోనే ఉండిపొమ్మన్నారు.

ఆ తర్వాత ఓరోజు నేను బడికి వెళ్తూండగా ప్రెసిడెంట్ కొడుకు యింకో విద్యార్థితో ఓ మాట అంటూండగావిన్నాను.

"వాడు నాకంటె అందంగా ఉంటాడా, నాకంటె ఎక్కువ మార్కులు తెచ్చుకుంటాడా క్లాసుల. నా ముందట యింకొకడు నాకంటే మంచిగుంటే నేనూర్కుంటానుర.. లంజకొడుకును... ఇప్పుడు ఏమైపోయిందో చూడు. జీవితాంతం కుంటోడై..." నవ్వుతున్నాడు భయంకరంగా.

ఇంత చిన్నపిల్లల్లో ఇంత ద్వేషమూ, ఇంత కక్షా, కసీ, పగా, యిన్‌ఫీరియారిటికి సంబంధించిన ఈర్ష్య యింత బలంగా ఉంటాయా అనిపించింది.

అంటే వాడు. కావాలనే వాణ్ణి చెడు పనుల్లోకి దింపి నాశనం చేసి చివరికి కాలు విరగ్గొట్టి - యిప్పుడు వాడు పతనమై పోయినందుకు నవ్వుతున్నాడా?

మనసంతా వికలమైపోయింది. మౌనంగా, నిస్సహాయంగా వెళ్ళిపోయాను.

ఆ తర్వాత నెలలో మళ్ళీ నాకు ఆ వూరునుండి ట్రాన్స్‌ఫరైపోయింది. మళ్ళీ కొత్త జీవితంలోకి, కొత్త మనుషుల నడుమకు వెళ్ళిపోయాను.

★ ★ ★

ఇది జరిగి పదేండ్లయిన తర్వాత - ఏదో పనిమీద హైద్రాబాద్ వెళ్ళాను.

సంగం టాకీస్ బస్‌స్టాండ్ దగ్గర నిలబడి ఎదురుచూస్తుండగా..

" బాబూ..కుంటోన్ని...పది పైసలు దానం చెయ్యండి." ఆ కంఠం .. ఆ మాట. - తలెత్తాను. చటుక్కున వాడు నరసింహులు-

నరసింహులు బిచ్చగాడు... బిచ్చగాడు... బిచ్చగాడు.....

నో- నో మనసు రెక్కతెగిన పావురంలా తన్నుకుంటోంది.

" నువ్వు నరసింహులు " ఏదో అనబోయాను. వాడు నావంక భయంగా, సిగ్గుగా, బాధగా చూచి కళ్ళనిండా నీళ్ళు నింపుకుని గిరుక్కున వెనక్కి తిరిగి పరుగెత్తుతున్నాడు భయంకరంగా కుంటుతూ..

ఎందుకో నాగుండెల్లోనుండి గొంతులోకి ఏదో దుఃఖపు పొర పొంగివస్తూ -

"ఇలా ఎందుకు జరిగింది".-

చూస్తున్నాను అచేతనంగా.

"సార్" ఉలిక్కిపడ్డాను.

ప్రక్కన భాస్కర్, వాని ప్రక్కన కారు.

ఇరవైఐదేండ్లు కూడా లేనివానికి కారు -

"నేను గుర్తున్నానా సార్.... భాస్కర్‌ను.. ఎప్పుడొచ్చారు? కారెక్కండి డ్రాప్ చేస్తాను. ఇలా పోతుంటే చటుక్కున కనపడ్డారు మీరు." అంటున్నాడు.

" ఏం చేస్తున్నావు నువ్విప్పుడు"

" బిజినెస్"

డోర్ తెరిచాడు. కారెక్కాను.

మనసు గంజిలోపడ్డ ఈగలా గింజుకుంటోంది. -

'స్వాతి' మాసపత్రిక
ఆగస్టు 1977